క్లుప్తంగా

నేడు పైడిపాడులో వై ఏపీ నీడ్స్ జగన్

జరుగుమల్లి: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధిని ప్రజలకు వివరించేందుకు వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని సోమవారం పైడిపాడు సచివాలయ పరిధిలో నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ బత్తిన మదన్ మనోహర్ తెలిపారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్లు హాజరు కావాలని సూచించారు.

మహాధర్నాను జయప్రదం చేయండి


మాట్లాడుతున్న ఉమామహేశ్వరరావు

కనిగిరి రూరల్: ఈ నెల 27, 28 తేదీల్లో విజయవాడలో జరిగే కార్మిక, రైతు మహాధర్నాను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కాలం సుబ్బారావు అన్నారు. స్థానిక సుందరయ్య భవన్‌లో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ అధిక ధరలను నియంత్రించాలని, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ నాయకులు జి. శ్రీనివాసులు, జీవీ కొండారెడ్డి, చీకటి శ్రీనివాసరావు, డీకేఎం రఫీ, పీసీ కేశవరావు, టి.రంగారావు, కె.మాల్యాద్రి, టి.మహేష్, బంకా సుబ్బారావు, పి.ఆంజనేయులు, ఆవులయ్య, ఐవీ రాఘవమ్మ పాల్గొన్నారు.

విత్తన శుద్ధితో పంట దిగుబడిలో వృద్ధి


ఎం.నిడమానూరులో బీజామృతంతో విత్తన శుద్ధి చేస్తున్న ఐసీఆర్పీ శృతి

టంగుటూరు: విత్తనాలకు తొలి దశలో ఆశించే తెగుళ్లను విత్తన శుద్ధితో అరికట్టవచ్చని ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఐసీఆర్పీ శృతి పేర్కొన్నారు. మండలంలోని ఎం.నిడమానూరు గ్రామంలో రైతు రమణారెడ్డి రెండు ఎకరాల పొలంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో శనగ పండించడానికి ఆసక్తి చూపడంతో ఆదివారం బీజామృతంతో విత్తన శుద్ధి చేశారు. ఇలా శుద్ధి చేయడం వల్ల 15 రోజులవరకు ఎటువంటి చీడ పురుగులను దరిచేరకుండా నివారిస్తుందని తెలిపారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పండించిన శనగలను టీటీడీ వారు బయట మార్కెట్ కంటే 15 శాతం అధిక ధరకు కొనుగోలు చేస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. వ్యవసాయానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేసిందని, రైతులకు రాయితీపై శనగ విత్తనాలు పంపిణీ చేయడంతోపాటు మద్దతు ధర కల్పిస్తోందన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా లక్ష్మీగణపతి ఆలయ వార్షికోత్సవం


పూజలందుకుంటున్న లక్ష్మీ గణపతి స్వామి

దర్శి: పట్టణంలోని లక్ష్మీ గణపతి స్వామి ఆలయంలో నాలుగో వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. కోటి సోమవారం పురస్కరించుకుని లక్ష్మీగణపతి హోమం, నవగ్రహ శాంతి హోమం, మూలవిరాట్‌కు పంచామృతాభిషేకాలు వేదపండితుల చేసి ఆగమ శాస్త్రం ప్రకారం నిర్వహించినట్లు ఆలయ గురుస్వామి రమణయ్య తెలిపారు. హాజరైన భక్తులకు పంచామృత తీర్థ, అల్పాహార ప్రసాదాలు అందజేశారు.

దొనకొండలో సీసీ రోడ్డుకు శంకుస్థాపన

దొనకొండ: స్థానిక అరబ్‌స్తాన్ వీధిలో రూ.10 లక్షల నిధులతో ఏర్పాటు చేసిన సీసీ రోడ్డును స్థానిక సర్పంచ్ కొంగలేటి గ్రేస్ రత్నకుమారి దేవానంద్ ఆదివారం ప్రారంభించారు. సీసీ రోడ్డుకు జిల్లా చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ నిధులు మంజూరు చేయటంతో స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డికి నాయకులు, కార్యకర్తలు కృతజ్ఞతలు తెలిపారు.


కందుకూరులో ఇందిరాగాంధీ చిత్రపటానికి నివాళులు


ఉలవపాడులో లెమన్‌స్పూన్ ఆటల పోటీలు

గ్రంథాలయాలు విజ్ఞాన ఆలయాలు

కందుకూరు రూరల్: కందుకూరు శాఖా గ్రంథాలయ 56వ జాతీయ వారోత్సవంగా ఘనంగా నిర్వహించారు. భారత తొలి మహిళా ప్రధాని ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గ్రంథపాలకురాలు పి.నాగరజిని మాట్లాడుతూ గ్రంథాలయాలను విద్యార్థులు ఉపయోగించుకొని విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులకు నృత్య ప్రదర్శన పోటీలు, స్కిప్పింగ్ పోటీలు నిర్వహించారు. వారం రోజుల పాటు నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన విజేతలకు సోమవారం బహుమతులు అందజేస్తామన్నారు. నిర్వాహకులు ఎస్‌కే.మీరాభి, పి.రోశయ్య, కిరణ్‌కుమార్, సుబ్బారావు, బాబు, తదితరులు పాల్గొన్నారు.

ఉలవపాడు: స్థానిక శాఖా గ్రంథాలయంలో ఆదివారం విద్యార్థులకు లెమన్‌స్పూన్ ఆటల పోటీలు నిర్వహించారు. 56వ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా పోటీలు జరిపారు. 112 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. ముందుగా దివంగత ప్రధాని ఇందిరాగాంధీకి నివాళులర్పించారు. వారం రోజులుగా జరిపిన పోటీల్లో విజేతలకు సోమవారం బహుమతులు అందచేయనున్నట్లు తెలిపారు. గ్రంథపాలకుడు దాసరి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

కనిగిరి రూరల్: స్థానిక గ్రంథాలయంలో 56 జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా ఆదివారం మహిళా దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో జెడ్పీ బాలికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కలువ విజయలక్ష్మి మాట్లాడుతూ మహిళా ప్రధానిగా ఇందిరాగాంధీ దేశానికి మంచి పరిపాలన అందించారన్నారు. మహిళా పోలీస్ రజియా సుల్తానా, గ్రంథపాలకుడు ఎస్‌కే అహ్మద్ షరీఫ్, జేవీవీ జాతీయ కార్యదర్శి ఎస్‌కే గయాజ్ పాల్గొన్నారు.

టంగుటూరు: గ్రంథాలయాలు విద్యార్థుల పాలిట దేవాలయాలని లైబ్రేరియన్ గుమ్మడి వర్ధనరాజు పేర్కొన్నారు. 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఆరో రోజు ఆదివారం స్థానిక గ్రంథాలయంలో మహిళా దినోత్సవం నిర్వహించారు. దిశ చట్టం, మహిళా సాధికారతపై చర్చా కార్యక్రమాలు నిర్వహించారు. మాజీ ప్రధాని స్వర్గీయ ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులకు దిశ చట్టంపై వక్తృత్వ పోటీలు నిర్వహించారు. వైఎస్సార్ టీఫ్ నాయకుడు సూదనగుంట వెంకటస్వామి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.


మాట్లాడుతున్న హెచ్‌ఎం విజయలక్ష్మి


టంగుటూరులో ఇందిరా గాంధీ చిత్రపటానికి నివాళి

భక్తి శ్రద్ధలతో కోటి సోమవారం


కామేపల్లిలో ప్రత్యేక అలంకరణలో పోలేరమ్మ తల్లి


శివలింగాలను పూజిస్తున్న భక్తులు

టంగుటూరు: కోటి సోమవారం సందర్భంగా జమ్ములపాలెం గ్రామంలోని అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వరాలయం, పంచముఖేశ్వర స్వామి 1116 శివలింగాల ఆలయంలో భక్తులు పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి పంచామృత అభిషేకాలు, గోత్రనామార్చన పూజలు చేశారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకకరించారు. పసుకుదురు గ్రామంలో పురాతన శివాలయంలో, టంగుటూరు శివాలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు.

పోలేరమ్మ ఆలయంలో..

జరుగుమల్లి: కార్తీక మాసం కోటి సోమవారం సందర్భంగా మండల పరిధిలోని కామేపల్లి పోలేరమ్మ ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఆలయ అర్చకుడు శ్రీధర శ్రీనివాసశర్మ పోలేరమ్మను ప్రత్యేకంగా పుష్పాలతో అలంకరించారు. భక్తులు ఆలయ ప్రాంగణంలో పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా ఈఓ రావెళ్ల శివశంకర్, ఆలయ చైర్మన్ సూరంపల్లి కొండయ్య, ధర్మకర్తల మండలి సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.


పెదయిర్లపాడులో పూజలు చేస్తున్న భక్తులు

భక్తిశ్రద్ధలతో కోటి సోమవారం

పీసీపల్లి: కార్తీక మాసంలో కోటి సోమవారం ప్రాముఖ్యమైనది. ఆదివారం కోటి సోమవారం సందర్భంగా మండలంలోని అన్ని శివాలయాలు కిటకిటలాడాయి. ఈ సందర్భంగా భక్తులు ప్రాతఃకాలమే ఆలయాలకు చేరుకొని శివునికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి మారేడు దళాలతో పూజలు నిర్వహించారు. మాలధారులు కూడా ప్రాతఃకాలమే శివుని నామసంకీర్తనలతో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. మండలంలోని పెదయిర్లపాడులో వెలసిన మల్లేశ్వర స్వామి ఆలయంలో భక్తులు స్వామి ముంగిట కార్తీక దీపాలు వెలిగించి ఆలయాన్ని అందంగా తీర్చిదిద్దారు. భక్తులకు ఆలయ అర్చకులు కార్తీక మాస విశిష్టతను గుర్చి వివరించారు.


జమ్ములపాలెంలో ప్రత్యేక అలంకరణలో పంచముఖేశ్వరుడు

మహిళలకు అండగా దిశ చట్టం


కొండపి గురుకుల పాఠశాలలో దిశ యాప్‌పై విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై


జరుగుమల్లిలో ఇందిరా గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న హెచ్‌ఎం

కొండపి(సింగరాయకొండ): మహిళల భద్రత కోసం రాష్ట్ర ప్రభుత్వం దిశా చట్టం రూపొందించిందని కొండపి ఎస్సై వై.నాగరాజు పేర్కొన్నారు. కొండపిలోని బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో ఆదివారం దిశ చట్టంపై అవగాహన కల్పించారు. ఎస్సై వై.నాగరాజు మాట్లాడుతూ.. ప్రభుత్వం దిశ చట్టంతోపాటు దిశ యాప్‌ను కూడా తీసుకొచ్చిందన్నారు. మహిళలు ప్రమాదంలో ఉన్నట్లయితే దిశ యాప్‌లో ఎస్‌ఓఎస్ బటన్ నొక్కితే వెంటనే వారి వద్దకు పోలీసులు చేరుకుని రక్షిస్తారని చెప్పారు. విద్యార్థినులు, మహిళలు తమ సెల్‌ఫోన్లలో దిశ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. శాఖాగ్రంథాలయాల వారోత్సవాల్లో భాగంగా గ్రంథపాలకుడు బి.కోటేశ్వరరావు పుస్తక పఠనంతో కలిగే ప్రయోజనాలను విద్యార్థినులకు వివరించారు. ప్రిన్సిపాల్ అరుణ, వైస్ ప్రిన్సిపాల్ వి.జ్యోతి, సిబ్బంది జయశ్రీ, పి.కె.శైలజ, లీలాకృష్ణ, జ్యోతి, హెడ్ కానిస్టేబుల్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

జరుగుమల్లి: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని జరుగుమల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఎం. శ్రీనివాసరావు పేర్కొన్నారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మాజీ ప్రధాని ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. గ్రంథాలయంలో స్వీయ పఠనం, చదవడం మాకిష్టం కార్యక్రమాల గురించి గ్రంథపాలకురాలు లక్ష్మీ నరసమ్మ వివరించారు. అనంతరం బాలికల్కు కబడ్డీ, ఖోఖో పోటీలు నిర్వహించారు. విజేతలకు జరుగుమల్లి సర్పంచి కసుకుర్తి పున్నారావు బహుమతులు పంపిణీ చేశారు. ఉపాధ్యాయులు అరుణ కుమారి, విజయలక్ష్మి, ప్రసాద్, ఎల్.శ్రీనివాసరావు, హాస్టల్ వార్డెన్ రంగ లక్ష్మమ్మ పాల్గొన్నారు.

ఘనంగా ఇందిరాగాంధీ జయంతి

కనిగిరి రూరల్: దివంగత మాజీ ప్రధాని ఇందిరా గాంధీ జయంతి వేడుకలను ఆదివారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా చేశారు. ఈ మేరకు పీసీసీ సభ్యుడు పిల్లి వెంకటేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో ఇందిరాగాంధీ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పీసీసీ సభ్యుడు పిల్లి వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ గరీబీ హటావో నినాదంతో పేదల జీవితాల్లో వెలుగు నింపిన ఉక్కు మహిళా ఇందిరాగాంధీ అని కొనియాడారు. ప్రైవేట్ రంగంలో ఉన్న 20 బ్యాంకులను జాతీయం చేసి ప్రభుత్వ రంగంలోకి తీసుకువచ్చారని పార్టీ నాయకులు వేల్పుల రాజశేఖర్, మహ్మద్ బాషా, సంగటి మల్లికార్జునరెడ్డి, చాంద్‌బాషా, తదితరులు పాల్గొన్నారు.


ఇందిరాగాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న పీసీసీ సభ్యుడు పిల్లి వెంకటేశ్వరరెడ్డి

గిరిజనుల శ్మశాన స్థలాన్ని కాపాడండి


గిరిజనులతో మాట్లాడుతున్న ప్రజాసంఘాల నాయకులు

సింగరాయకొండ: మండలంలోని పాతసింగరాయకొండ పంచాయతీలో బాలిరెడ్డి నగర్, పోతుల చెంచయ్య నగర్, మల్లికార్జుననగర్ గిరిజన కాలనీలకు ప్రభుత్వం కేటాయించిన నాలుగు ఎకరాల స్థలాన్ని కాపాడాలని ఆదివారం పలు సంఘాల నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. ఇటీవల ఒక వ్యక్తి శ్మశాన స్థలాన్ని ఆక్రమించే ప్రయత్నం చేశాడని ఆరోపించారు. శ్మశానాన్ని కబ్జా చేయాలని చేస్తే తామంతా ఉద్యమిస్తామని హెచ్చరించారు.

భైరవకోనలో ప్రత్యేక పూజలు


వేదఆశీర్వచనం చేస్తున్న ఆలయ పూజారులు

సీఎస్‌పురం (పామూరు): పవిత్ర కార్తీకమాసం కోటిసోమవారంను పురస్కరించుకుని ప్రముఖ పుణ్యక్షేత్రం, పర్యాటక కేంద్రం భైరవకోన త్రిముఖదుర్గాదేవి, భుర్గులేశ్వర, కాలభైరవ ఆలయాలలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా విజయవాడకు చెందిన విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అడిషనల్ డైరెక్టర్ ఎల్‌వీ రమణమూర్తి దంపతులు, ఆ శాఖ డీఈఈ శివశంకర్, ఏఈఈ చిరంజీవి జలపాతాన్ని దర్శించుకున్నారు. అనంతరం త్రిముఖదుర్గాదేవి, కాలభైరవ ఆలయాల్లో పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ సిద్ధు రమణారెడ్డి, ఈఓ నర్రా నరాయణరెడ్డి ఆధ్వర్యంలో ఆలయ మర్యాదలతో అర్చకులచే వేద ఆశీర్వచనం చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు. సిద్ధు వెంకటరెడ్డి, పీఆర్ ఏఈఈ రామక్రిష్ణ, బసివి, చంద్రశేఖర్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమి ఆక్రమణ


ట్రాక్టర్‌తో దున్నుతున్న అక్రమార్కులు

గుడ్లూరు: కోర్టు స్టే ఆర్డర్ ఉన్న ప్రభుత్వ భూమిని అక్రమార్కులు ఆక్రమించుకొని దున్నుతున్న సంఘటన మండలంలోని గుండ్లపాలెం గ్రామంలో జరిగింది. వివరాల ప్రకారం... గుండ్లపాలెం అడ్డరోడ్డు వద్ద సర్వే నంబర్ 237లో ఐదెకరాల ప్రభుత్వ భూమిని గతంలో గ్రామానికి చెందిన అక్రమార్కులు ఆక్రమించుకొని సాగు చేస్తున్నారు. అయితే నెల రోజుల క్రితం అది ప్రభుత్వం భూమి అని గ్రామంలోని ఎస్సీ కాలనీకి చెందిన ప్రభుదాసు, ఆదాం, జాలయ్య, సురేష్ తదితరులు కోర్టుకు వెళ్లారు. దీనిపై కోర్టు స్టేషన్ కో ఆర్డరఇచ్చింది. రెవెన్యూ అధికారులు అది ప్రభుత్వ భూమి అని, దాన్ని ఎవరూ అక్రమించుకోరాదని ఐదెకరాల వద్ద బోర్డు ఏర్పాటు చేసి గ్రామంలో దండోరా వేయించారు. అయినా సెలవు రోజు కావడంతో అక్రమార్కులు ఆదివారం ఆ భూమిలో ట్రాక్టర్‌లో దున్నడం మొదలుపెట్టారు. దీనిపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఓటర్ల నమోదు పారదర్శకంగా నిర్వహించాలి


మాట్లాడుతున్న ఆర్డీఓ పాలపర్తి జాన్ ఇర్విన్

సీఎస్‌పురం (పామూరు): పారదర్శక ఓటర్లజాబితా రూపకల్పనకు మండలంలోని బీఎల్‌ఓలు అంకిత భావంతో పనిచేయాలని కనిగిరి ఆర్డీఓ పాలపర్తి జాన్ ఇర్విన్ అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆదివారం మండలంలోని బీఎల్‌ఓల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ 18 ఏళ్ల నిండి ఓటుకోసం దరఖాస్తుచేసిన వారందరికి ఓటు వచ్చేలా చూడాలన్నారు. ఓటర్లుగా ఉండి ఎవరైనా మృతిచెందినా, పూర్తిస్థాయిలో వలసలు వెళ్లిపోయినా నిబంధనలకు అనుగుణంగా తగు ఆధారాలతో ఓటు తొలగింపుకు సిఫారసు చేయాలన్నారు. అదేవిధంగా ఓటర్ల జాబితాలో తప్పుల సవరణలు, ఫొటో సవరణలు సకాలంలో పూర్తిచేయాలన్నారు. తహసీల్దార్ నాగూర్‌మీరా, ఆర్ఐ పి.శ్రీధర్‌బాబు, డిప్యూటీ తహసీల్దార్ యం.సలోమి, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిర్మూలన అందరి బాధ్యత


అవగాహన సదస్సులో మాట్లాడుతున్న కేజీబీవీ ఎస్‌ఓ సజన

పామూరు: బాలల హక్కులను కాపాడటంతో పాటు బాల్యవివాహాల నియంత్రణ, బాలికల అక్రమ రవాణా నిర్మూలన సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని కేజీబీవీ ఎస్‌ఓ కటకం సజన, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు గోళ్ల పద్మజ, పార్వతిలు అన్నారు. స్వయంకృషి స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు షేక్.నాయబ్‌రసూల్ ఆధ్వర్యంలో స్థానిక కస్తూరిబాగాంధీ బాలికా విద్యాలయంలో ఆదివారం బాలికల హక్కులు, బాల్య వివాహాల నిర్మూలన, బాలికల అక్రమ రవాణా నిర్మూలనపై అవగాహన కార్యక్రమం, విద్యార్థినులకు వ్యాసరచన పోటీలు, అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాల్యవివాహాలు చేసుకున్న వారిలో ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని ఇదిఎంతమాత్రం ఆరోగ్యకరం కాదన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ఉన్నత విద్య చదివించాలనే లక్ష్యంతోపాటు వివాహ వయసు లేకుండా వివాహాలు చేయకూడదనే అవగాహన కలిగి ఉండాలని, ఈ దిశగా సమాజంలో అవగాహన ఎంతో అవసరమన్నారు. వివాహ వయసు యువతులకు కనీసం 18 ఏళ్లు, యువకులకు 21 ఏళ్లు నిండి ఉండాలన్నారు. ఎక్కడైనా బాల్యవివాహాలు నిర్వహిస్తుంటే పోలీస్, ఐసీడీఎస్ వారికి సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో జయలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

దిశ చట్టంపై అవగాహన అవసరం


మాట్లాడుతున్న ఎస్సై ప్రసాద్‌రెడ్డి

గుడ్లూరు: దిశ చట్టం, మహిళా సాధికారితపై అవగాహన పెంచుకోవాలని ఎస్సై కె.ప్రసాద్‌రెడ్డి అన్నారు. గుడ్లూరు ఎర్రప్రగఢ గ్రంథాలయంలో 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా దివంగత ప్రధాన మంత్రి ఇందిరాగాంధీ జయంతిని పురస్కరించుకొని ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎస్సై మాట్లాడుతూ మహిళా రక్షణకు ప్రభుత్వం దిశ చట్టం తీసుకువచ్చిందన్నారు. విద్యార్థినులు ఈ చట్టంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా విద్యార్థినులకు ముగ్గులు పోటీలు నిర్వహించారు. గ్రంథపాలకుడు ప్రభాకర్‌రెడ్డి అధ్యక్షత వహించిన కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

వైభవంగా సాయిమందిర్ వార్షికోత్సవం


భక్తులకు ఆశీర్వచనం అందిస్తున్న హిమగిరీంద్ర స్వామీజీ

సింగరాయకొండ: మండల కేంద్రంలోని షిరిడీ సాయి మందిర్‌లో ఆదివారం 24వ వార్షికోత్సవం, కోటి సోమవారం పూజలను ఆలయ నిర్వాహకుడు కొల్లూరి సత్యన్నారాయణ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సామూహిక విష్ణు సహస్ర నామం, సాయి చాలీసా, కనకధారా స్తోత్రం పారాయణం, శ్రీసూక్తయుక్త పుష్పార్చన చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన పుష్పయాగంలో హరిద్వార్‌కు చెందిన హిమగిరీంద్ర స్వామీజీ పాల్గొని భక్తులకు ప్రవచనాలు చెప్పారు. అనంతరం భక్తులకు మహా అన్న సంతర్పణ చేశారు. రాత్రికి కర్పూరయజ్ఞం కార్యక్రమం కన్నుల పండువగా నిర్వహించారు. దేవీ సీఫుడ్స్, జీవీఆర్ కంపెనీ ఎక్స్‌పోర్ట్స్, పెరల్ డిస్టిలరీ ఆర్థిక సహకారంతో కార్యక్రమం నిర్వహించినట్లు నిర్వాహకులు సత్యన్నారాయణ పేర్కొన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నేడు కొనకనమిట్లలో విద్యుత్ అదాలత్

కొనకనమిట్ల: కన్స్యూమర్ గ్రీవెన్సెస్ రిడ్రెస్సెల్ ఫోరం, విజయవాడ ఆధ్వర్యంలో సోమవారం కొనకనమిట్ల మండల కేంద్రంలో విద్యుత్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు దర్శి ఏడీఈ ఎస్.అబ్దుల్ కరీం ఒక ప్రకటనలో తెలిపారు. సెక్షన్ కార్యాలయం ప్రాంగణంలో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సీజీఆర్ఎఫ్ చైర్ పర్సన్, రిటైర్డ్ జడ్జి ఎస్.విక్టర్ ఇమ్మానుయేల్, ఫోరం సభ్యులు ఒంగోలు సూపరింటెంట్ ఇంజినీర్ కే.వి.జి.సత్యనారాయణ, డివిజన్ స్థాయి విద్యుత్ అధికారులు పాల్గొంటారని తెలిపారు. సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని ఏడీఈ కోరారు.